క్లుప్తంగా

నల్లగొండ ఎంపీ టికెట్ బీసీలకు ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ సోమవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావాలని గెలుపు గుర్రాల పేరిట ధనికులు, అగ్ర కులాల వారికే ఎక్కువగా అసెంబ్లీ సీట్లు కేటాయించినట్లు తెలిపారు. దేశ జనభాలో సగ భాగం ఉన్న బీసీలను విస్మరిస్తున్నారన్నారు. దేశ జనాభాలో 50శాతంకు పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో మాత్రం ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. బీసీలను అన్నీ రాజకీయ పార్టీలు మోసం చేస్తుందని, బీసీలకు కాంగ్రెస్ పార్టీకి నిజంగా ప్రేమాభినం ఉంటే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 9 సీట్లు కూటాయించాలని కోరారు.

బకాయిలు వసూలు చేయాలి

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుకు సంబంధించి బకాయిలను వసూలు చేయాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల బకాయిలు వంద శాతం వసూలు చేయాలని ఆయన సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థకు చేరిన ఇళ్లకు సంబంధించి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



గొన్యాతండాలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి : మండలంలోని గొన్యాతండా, అడవిదేవులపల్లి, చంప్లాతండా కొత్తనందికొండ గ్రామాల్లో సోమవారం నర్సరీలు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఎంపీఓ మోసిన్‌లు పరిశీలించారు. అనంతరం పలు సూచనలు ఇచ్చారు. వారి వెంట ఏపీఓ సూర్యానాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాసుదేవారెడ్డి, శ్రీను, జానకి, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఊయల బహూకరణ



ఊయల బహూకరిస్తున్న దాతలు సూర్యప్రకాశ్, లలిత

హాలియా : అనుముల మండలంలోని మారేపల్లి గ్రామ స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉంజల్ సేవకు దాత సోమవారం ఊయల బహూకరించారు. మారేపల్లి గ్రామానికి చెందిన కోట్ల సూర్యప్రకాష్, లలిత దంపతులు రూ. 1.16లక్షల విలువైన ఊయలను దేవాదాయ శాఖ ఈఓ అంబటి నాగిరెడ్డి, చైర్మన్ మట్టపల్లి వెంకన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ వంగాల మదనాచారి, ఆలయ ప్రధాన అర్చకులు శేషచార్యులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రామగిరి(నల్లగొండ): ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మిషన్ భగీరథ ఉద్యోగి కస్పరాజు నవీన్ కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం తిప్పర్తి మండలంలోని గడ్డి కొండారంలో బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి పరామర్శించి మంత్రి కోమటిరెడ్డి పంపిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూకూరి రమేష్, యూత్ అధ్యక్షుడు బద్దం సుధీర్, పాశం సంపత్‌రెడ్డి, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, రొట్టెల రమేష్, కిన్నెర అంజి తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

దేవరకొండ : దేవరకొండ మండల పరిధిలోని తాటికోల్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ నర్సింహులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో యూనియన్ ఎన్నిక

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి, దేవరకొండ ఆటో యూనియన్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అందుగుల జానయ్య, అధ్యక్షుడిగా ఎండి.జానిబాబా, ఉపాధ్యక్షులుగా ఆకూరి చినరాజు, వి.యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా మూఢావత్ సుక్య, సహాయ కార్యదర్శిగా తోటపల్లి నగేశ్, సాంబ, కోశాధికారిగా వెంకన్నతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రూ.19.88 కోట్లు వసూలయ్యేనా!

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో భారీగా ఆస్తి పన్ను బకాయిలు
- వసూలు చేయాల్సింది రూ 25.49కోట్లు
- ఇప్పటి వరకు రూ.5.60కోట్లు వసూలు
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసిన మున్సిపల్ అధికారులు



మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో భారీగా ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. వచ్చే నెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. రూ.25.49కోట్లు వసూలు కావాల్సి ఉండగా కేవలం రూ.5.60కోట్లు మాత్రమే వసూలు చేశారు. మిగతా పన్నుల వసూలు చేయడంతో అలసత్వాన్ని అధికారులు ప్రదర్శిస్తున్నారు. ఇలానే ఉంటే మున్సిపాలిటీ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తుంది. కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పైసా కూడా విడుదల కావడం లేదు. పారిశుద్ధ్యం, వేతనాలు, వీధి దీపాలు ఇతర అవసరాలను సమకూర్చాలంటే మున్సిపాలిటీ ప్రధాన వనరు ఆస్తి పన్ను. ప్రస్తుతం అది కూడా సరిగా వసూలు కాకపోవడంతో పాలకవర్గం సర్దుబాటు చేయలేక ఇబ్బందులు పడుతుంది. బడ్జెట్‌లో రెట్టింపుతో సొంత ఆదాయాన్ని సమకూర్చుందని అంచనాలు రూపొందించినా... వాస్తవానికి వస్తే ప్రతి నెలా సర్దుబాటు ప్రయత్నాలే కనిపిస్తున్నాయి. లోటు బడ్జెట్ స్పష్టంగా కనిపిస్తుంది. నెలవారి నిర్వహణకు, బిల్లులు చెల్లింపులకు ఆస్తి పన్ను ద్వారా సమికరించుకోవాల్సిందే.

నత్తనడకన వసూలు

ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కొద్ది రోజులు మాత్రమే అవకాశం ఉంది. మున్సిపాలిటీలో 2023–2024 ఆర్థిక సంవత్సరానికి గాను ఎరియర్స్, ప్రస్తుత ఆస్తి పన్నుతో పాటు మెండి బకాయిలు కలుపుకొని మొత్తం రూ.25 కోట్ల 49లక్షల16 వేలు వసూలు చేయాల్సి ఉండగా ఈనెల 24వ తేదీ వరకు రూ.5కోట్ల 60లక్షల62వేలు వసూలు చేశారు. ఇంకా రూ.19కోట్ల 88లక్షల54వేలు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికీ వరకు కేవలం 6.8శాతం మాత్రమే వసూలు చేశారు. మున్సిపల్ అధికార యంత్రాంగం పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిని సారించినప్పటికీ పన్ను వసూళ్ల మాత్రం నత్తనడకన సాగుతోంది. ప్రస్తుతం మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులుండగా 25 వేల 599 అసైస్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్(మిక్స్‌డ్), కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. కాగా ఈ మున్సిపాలిటీలో మొండి బకాయిలు భారీగా పెరుగుతున్నాయి. మొండిబకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నా వారి నుంచి స్పందన లేదు.

ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.3.44కోట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఆస్తి పన్నులు వసూలు చేయడంలో మిర్యాలగూడ మున్సిపాలిటీ చతికిల పడింది. ప్రభుత్వ రంగ సంస్థల అసైస్‌మెంట్లు మొత్తం 545 భవనాలు ఉన్నాయి. వీటిలో సెంట్రల్ గవర్నమెంట్ భవనాలు 155, రాష్ట్ర గవర్నమెంటు భవనాలు 390 ఉన్నాయి. ఆయా ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలు రూ.3.44కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం భవనాల ద్వారా రూ.2కోట్ల 76లక్షల 5వేలకు గాను కేవలం రూ.5లక్షల 21వేలు మాత్రమే వసూలైంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.68లక్షల 2వేలు వసూలు కావాల్సి ఉండగా కేవలం రూ.20లక్షల 92వేలు మాత్రమే వసూలు అయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆస్తి పన్ను విడుదల కాకపోవడంతో బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను మొత్తం బకాయిలు చెల్లిస్తే మున్సిపాలిటీకి పరిపాలన నిర్వహణకు కొంత మేరకు ఉపశమన కలిగే అవకాశం ఉంది. ప్రభుత్వ శాఖలు కరుణించేది ఎప్పుడో బకాయిలు చెల్లించేది ఎప్పుడో కాలమే నిర్ణయిస్తుంది. ప్రజలపై తీవ్రమైన ఒత్తిడి పెంచి వందశాతం వసూలు చేయాలని ఆదేశాలు ఇస్తున్న అధికారులు ప్రభుత్వ శాఖల అధికారులు బకాయిల చెల్లింపు మున్సిపాలిటీ అధికారులు నోరు మెదపండం లేదు.

పన్నులు చెల్లించి సహకరించాలి



మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి. పన్ను రాకపోతే అభివృద్ధి పనులు కుంటుపడుతాయి. పూర్తి స్థాయిలో వసూలు చేసే విధంగా అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. ముందస్తుగా నోటీసులను కూడా జారీ చేశాం. ఆస్తి పన్ను చెల్లించకుంటే జప్తు కూడా చేయాల్సి ఉంటుంది. మార్చి 31లోగా పూర్తి స్థాయిలో చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలి.

– మహ్మద్ యూసుఫ్ మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

వాటర్ ట్యాంక్‌పై మొక్కల తొలగింపు



మంచినీటి ట్యాంకుపై ఉన్న పిచ్చి మొక్కలు

సాక్షి ఎఫెక్ట్..



మంచినీటి ట్యాంకుపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించిన పంచాయతీ సిబ్బంది

అడవిదేవులపల్లి : మండలం కేంద్రంలో ఈనెల 6వ తేదిన సాక్షి దినపత్రిక జిల్లా టాబ్లాయిడ్‌లో 'పొంచి ఉన్న ముప్పు' అనే కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం మంచినీటి ట్యాంకుపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.

యవత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ : యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు సాధించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో క్లియా స్పోర్ట్స్ అరేనా మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు స్నేహసంబంధాలు మెరగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ కోచ్ ఎం.రామకృష్ణ, జి.రవికిరణ్, జి.సోమయ్య, ఈశ్వర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ ఆలయ ప్రారంభోత్సవం



జప్తి వీరప్పగూడెం లో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలంలోని చింతపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ సమేత లక్ష్మణ, ఆంజనేయ, గణపతి స్వామివారి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కీర్త ధ్వజ, విగ్రహా, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా పరిసర ప్రాంత గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లి జాతర



జాతర సందర్భంగా భేరి మోగిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి : మండంలోని బుగ్గబావిగూడెం సమీపంలో కొలువై ఉన్న యాదవుల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లిని సోమవారం తెల్లవారుజాము నుంచే జిల్లాలోని నలుమూలల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకోని తమ మొక్కులను చెల్లించుకున్నారు. యాదవులు డప్పువాయిద్యాలతో, కాళ్లకు గజ్జలు కట్టుకోని బలిగంపలతో, బోనాలతో ఊరేగుతూ గంగమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. మహిళల పెద్దఎత్తున నెత్తిన బోనాలు పెట్టుకోని గంగమ్మతల్లి గుడి చుట్టు ప్రదిక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. జాతరకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మండల స్థాయి అధికారులు గంగమ్మతల్లిని దర్శించుకోని మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మ జాతర ఉత్సవానికి పలు గ్రామాల భక్తులు పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో గుట్టపై ఉన్న గంగమ్మ దేవాలయం వద్ద రద్దీ ఎక్కువ కావడంతో తోపులాట జరగకుండా పోలీసులు తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు

బుగ్గబావిగూడెం గ్రామంలో నిర్వహించిన గంగమ్మ జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటూ రాష్ట్రం పాడిపంటలతో తులతూగేలా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎంపీపీ పుట్టల సునీత, తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఆర్ఐ మహేందర్‌రెడ్డి, నాయకులు కృపయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్, నాగవెల్లి మధు, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య, ఎస్‌కె.హాజీ, కరుణాకర్‌రెడ్డి, బాబయ్య పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా నరేందర్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని దుగ్యాల గ్రామంలోని కోదండ రామాలయ చైర్మన్‌గా గుడిగోపురం నరేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం దేవాయ ఆవరణలో దేవాలయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పాలకమండలి ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ చైర్మన్‌గా గ్రామానికి చెందిన గుడిగోపురం నరేందర్‌రెడ్డి , సభ్యులుగా ఆకనబోయిన శ్రీనివాస్, నర్రావుల బ్రహ్మానందరెడ్డి, కోమళ్ల వెంకటేశ్వర్లు, ఆడెపు రాములమ్మ, కో ఆప్షన్ మెంబర్‌గా ఆలయ పూజారి పవన్‌కుమార్‌లు ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం నూతనంగా ఎన్నికై న సభ్యులను పలువురు సన్మానించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

33 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాగార్జున జూనియర్ కళాశాల 1989-91 సీఈసీ బ్యాచ్

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని నాగార్జున జూనియర్ కళాశాల 1989–91 ఇంటర్మీడియట్ సీఈసీ పూర్వ విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా అనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం అప్పటి కళాశాల ప్రిన్సిపాల్ అనుముల మధుసూదన్‌రెడ్డిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పటి అధ్యాపకులు ఇంద్రసేనారెడ్డి, నాగయ్య, లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు సైదిరెడ్డి, రేపాల శ్రీనివాస్, సిద్ధయ్య, వెంకన్న పాల్గొన్నారు.

బోరు గుంత పూడ్చివేత



తెరుచుకున్న బోరు గుంతను పూడ్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద బోరు గుంత తెరుచుకొని ఉండగా ఈనెల 22న సాక్షి దిన పత్రిక జిల్లా టాబ్లాయిడ్‌లో 'పూడ్చకుండా వదిలేశారు'. అనే శీర్షికన ప్రచురితమైన కథనాని అధికారు స్పందించారు. సోమవారం రాజీవ్‌చౌక్ వద్ద ఉన్న బోరు గుంతను పూడ్చివేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలు చేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నోముల భగత్

గుర్రంపోడు : మండలంలోని చామలేడు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉమామహేశ్వరస్వామి, దుర్గమ్మ, గౌరమ్మల విగ్రహ ప్రతిష్ఠాపనమహోత్సవంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ దోటి చంద్రమౌళి, నాయకులు ధనుంజయ, వెంకట్ రెడ్డి, గజ్జెల చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ చాడ చక్రవర్తి, రామచంద్రం, భాస్కర్, వెంకటయ్య, శ్రీను, కుర్మారెడ్డి, మహేందర్, శ్రీను, నర్సింహ్మ, సయ్యద్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో జడ్పీటీసీ గాలి రవికుమార్,బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు వెల్గపూరి కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మిర్యాలగూడ : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.సంపత్‌కుమార్‌లు అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూకల సరహహన్మంతరెడ్డి అధ్యక్షతన వాటర్‌గ్రిడ్ అధికారులకు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేపట్టాలని, నల్లాల ద్వారా ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు పి.కరుణాకర్ రావు, ఆయాశాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని వినతి

నల్లగొండటౌన్: మృతి చెందిన మిషన్ భగీరథ కార్మికురాలికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండలో మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న సింగం పుష్పలత ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులకు రూ.8 లక్షలు ఇస్తామని జీవీపీఆర్ కంపెనీ హామీ ఇచ్చి కేవలం రూ.6 లక్షలు చెల్లించిందని అన్నారు. మిగతా రూ.2 లక్షలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆయన సోమవారం కలెక్టరేట్‌లో ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట పుష్పలత కుటుంబ సభ్యులు సాన్విత, సాయినందన్, సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ.జాని, ఉయ్యాల రవి, ఎస్‌కె. సలీం, శేఖర్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ బాబా ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజా రమేష్ యాదవ్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామ్‌సింగ్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, కొప్పు నవీన్‌గౌడ్, మంచికంటి సిద్ధార్థ, శంకర్ యాదవ్, వంశీ, నందిని, అజహరుద్దీన్, ఇర్ఫాన్, రబ్బానీ, బాసీత్, దాసరి విజయ్, నరేష్, పవన్ కుమార్, పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 25న కోదాడలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో మిర్యాలగూడ శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థిని కుమ్మరికుంట్ల చిద్విలాసిని ఓవర్ ఆల్ చాంపియన్‌షిప్ సాధించింది. సోమవారం ఈ సందర్భంగా చద్విలాసినిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పోటీల్లో 200మందికి పైగా పాల్గొనగా మంచి ప్రతిభ కనబర్చినందుకు పాఠశాల కరస్పాండెంట్ రెడబోతు నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ జయంతిలు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మంచి క్రీడాకారినిగా గుర్తింపు సాధించాలని కోరుకున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు జూలూరి ధనలక్ష్మి బాలనారాయణగౌడ్ సహకారంతో సమకూర్చిన పరీక్ష సామగ్రిని సోమవారం బీసీ పొలిటికల్ యుజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీశ్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, రేణుక, మహేశ్, ఆంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సతీశ్‌గౌడ్

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పెద్దవూర : ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



హాలియా : వీఎస్ఆర్ హైస్కూల్‌లో విద్యార్థులు

పెద్దవూర : మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి.బాలోజీ, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, ఎండీ.షబ్బీర్, డి.శ్రీనునాయక్, డి.సైదులు, సంధ్య, షాహీన్‌బేగం, రామయ్య, శాంతి తదితరులు పాల్గొన్నారు.

హాలియా : పట్టణంలోని వీఎస్ఆర్ హైస్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య బహుమతుల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, సాయిరాంరెడ్డి, సాయి, అశ్విని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.